
# ప్రమోషన్

బి. విద్యాసాగర్




"ఈ పల్లెటూళ్ళో యెన్నాళ్ళు ప్రాక్టీసు చేసినా, సంపాదన యింతకంటే పెరగదు. ఇక్కడ ఫైలు తక్కువ. ప్లీడర్లు యెక్కువ" అన్నాడు హనుమంతరావు బార్ రూమ్‌లో.

"నిజమే! ప్రతివాళ్ళూ యల్. యల్. బి. ప్యాసయి, యే వుద్యోగం దొరకక ప్రాక్టీసు చేయడానికి సిద్ధమవుతున్నారు" అన్నాడు ఆనందరావు.

"పాతికేళ్ళ లోపుగా యే వుద్యోగంలోను స్థిర పడకపోతే, గ్రాడ్యుయేట్లు బి. ఇ. డి. చదివి మేష్టర్లవుతున్నారు. లేకపోతే లా ప్యాసయి ప్లీడర్లుగా తయారవుతున్నారు" అన్నాడు చిదంబరం.

"ఏదైనా పట్నంలో ప్రాక్టీసు చేద్దామంటే, మన బోర్డు చూసి యెవరూ రారేమోనని భయం! ఎవరైనా సీనియర్ దగ్గర చేరి కొన్నాళ్ళు కట్టలు మోస్తేకానీ, పని నేర్చుకోలేరు జూనియర్లు." అన్నాడు ఆనందరావు.

"ఏమి నేర్చుకోవడంలే! సీనియర్లు ముఖ్యమైన దావాలలో తామే హాజరవుతారు. వాయిదా కోరడానికి మాత్రం పనికివస్తారు జూనియర్లు. కొంతమంది సీనియర్లు, జూనియర్ అడ్వకేట్లనుపోర్టర్ల క్రింద వాడుకుని, కోర్టుకు ఫైల్సు మోసుకొచ్చి అందించమంటారు."

"ఈ అవస్థలు పడటంకంటే మున్సిఫ్‌గా సెలక్టు అయినామంటే భలే ఛాన్సు" అన్నాడు హనుమంతరావు.

"నిజమే! కాని మనకు యెవడు యిస్తాడు? రికమెండేషన్ వుండేనే సెలక్టు కావడం కష్టం" అన్నాడు చిదంబరం.

"ఏమైనా ఈసారి నేను "అప్లయి" చేద్దామనుకుంటున్నాను. మన అదృష్టం బాగుండి సెలక్టు అయినామంటే, జీవితాంతం నిశ్చింతగా వుండవచ్చును" అన్నాడు హనుమంతరావు.

"అలాగే దరఖాస్తు పంపించు. విష్ యూ గుడ్‌లక్" అన్నాడు చిదంబరం.

* * *

హనుమంతరావు జిల్లామున్సిఫ్ పోస్టుకు దరఖాస్తు పంపించాడు. పంపించడానికి ముందు, ఒక పురోహితుడిని కలుసుకుని, మంచిరోజుచూసి ముహూర్తం పెట్టమన్నాడు. ఆయన ఫలానారోజు, ఫలానా సమయంలో మీరు దరఖాస్తు పంపితే, మీకు మేలు జరుగుతుందని చెప్పాడు. అలాగే హనుమంతరావు, దైవప్రార్థన జరిపి, సుమూహూర్తంలో దరఖాస్తు వ్రాసిపంపాడు. మున్సిఫ్‌గా సెలక్టు అయితే, తిరుపతివచ్చి జుట్టు తీయించుకుంటానని వెంకటేశ్వరస్వామికి మొక్కుకుందామనుకున్నాడు. కానీ, తీరా మున్సిఫ్ అయినాక గుండుతో కోర్టుకు వెళ్తే బాగుండదని నిర్ణయించుకుని, స్వామి దర్శనం చేసుకుంటానని సవరణ ప్రతిపాదించాడు.

దరఖాస్తు పంపించినట్లు కోర్టులో స్నేహితులకు తెలియ చేశాడు. ఇక అందరూ వూహాగానాలు ప్రారంభించారు. హనుమంతరావు మున్సిఫ్‌గా సెలక్టు అయి తమ వూరికే వస్తే, తమకు అనుకూలంగా కేసులలో తీర్పులు చెప్పవచ్చునని భావించారు కొందరు. లేదా మరొక వూళ్ళో అతను పని చేస్తుంటే, ఆ వూరు యేదైనా పనిమీద వెళ్ళినప్పుడు, హోటల్‌లో దిగనవసరం లేకుండా, అతని యింట్లో దిగి పని పూర్తిచేసుకుని రావచ్చునని భావించారు కొందరు. చిదంబరం అనే అడ్వకేటు, హనుమంతరావుతో "నీ జాతకం వుంటే పట్టుకునిరా! నువ్వు సెలక్టు అవుతావో, లేదో చెపుతాను" అన్నాడు. అతనికి హనుమంతరావుతో చనువు బాగా వుంది.

"ఏమిటి? నీకు జ్యోతిష్యంకూడా వచ్చునా?"

"కొద్దిగా తెలుసులే! జాతకాలు చూసి చెప్పడం నేర్చుకున్నాను" అన్నాడు చిదంబరం.

మర్నాడు హనుమంతరావు జాతకం పట్టుకుని వచ్చి, మధ్యాహ్నం విరామ సమయంలో, బార్ రూమ్‌లో చిదంబరంకి రహస్యంగా యిచ్చాడు. చిదంబరం లౌడ్‌స్పీకర్ లాంటివాడు. లేదా వొక రేడియో ప్రసారకేంద్రం లాంటివాడు. అతను వెంటనే, బిగ్గరగా, అందరికీ వినిపడేటట్లు,

"జాతకంలో యోగం వుంటే నీకు తప్పకుండా వస్తుంది." అని జాతకం వొక క్షణం పరిశీలించి "నీకు యిప్పుడు శని మహర్దశ జరుగుతోంది. శనిలో శుక్రుడు ప్రవేశించగానే, నీకు తప్పకుండా సెలక్షన్ వస్తుంది." అన్నాడు చిదంబరం. నిజానికి అతనికి జాతకాలు చూడటం తెలియదు. కాసేపు తమాషా చేద్దామని జాతకం తెమ్మని చెప్పాడు.

"అంటే, యెప్పుడు వస్తుందంటావు?" ఆదుర్దాగా అడిగాడు హనుమంతరావు.

"మార్చిలో ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఏప్రిల్ మొదటి వారంలో నీకు ఆర్డర్సురావచ్చును" అన్నాడు చిదంబరం.

"ఏమిటీ! నాకు తప్పకుండా వస్తుందంటావా!"

"గ్రహబలం చూస్తే అలాగే అనిపిస్తోంది." అన్నాడు చిదంబరం.

ఆ రోజు సాయంత్రం, హనుమంత రావు యింటికి చాలా హుషారుగా వెళ్ళాడు. మున్సిఫ్‌గా తను సెలక్టుఅయినట్టే భావించాడు. కోర్టులో ప్లీడర్లు తనవంక చూసి "యువర్ ఆనర్" అంటుంటే, యెంత బాగుంటుంది అనుకున్నాడు.

* * *

మార్చినెలలో ఇంటర్వ్యూకి పిలిచారు. ఆరోజు, అంటే ఇంటర్వ్యూకి రమ్మని వుత్తరంవచ్చినరోజు హనుమంతరావు ఎంతో ఆనందించాడు. ప్లీడర్లంతా టీపార్టీ యిమ్మన్నారు. ఇంకా సెలక్టు కాలేదుకదా, సెలక్టు అయితే తప్పకుండా పార్టీ యిస్తానన్నాడు. పోనీ బార్‌రూమ్‌లో ఆ సమయంలోవున్న పదిమందికి కాఫీలు తెప్పించమంటే, పోనీలే, స్నేహితులు అడుగుతున్నారని కాఫీలు తెప్పించాడు.

ఇంటర్వ్యూకి వెళ్ళివచ్చాడు. ఇంటర్వ్యూకి బాగా సిద్ధమయి వెళ్ళాడు. అడిగిన ప్రశ్నలం తడుముకోకుండా సమాధానం చెప్పాడు. బహుశ, తప్పకుండా సెలక్టు కావచ్చునని ఆశాభావంతో వున్నాడు.

* * *

రోజులు గడిచిపోతున్నాయి ఆ రోజు హనుమంతరావు కోర్టు బార్‌రూమ్‌లో వుండగా, పోస్ట్

మన్ వచ్చి వొక వుత్తరం యిచ్చివెళ్ళాడు. హనుమంతరావు చేతిలో యింకా వుత్తరం పడిందో లేదో, చిదంబరం లాక్కొని, "ఏమిటోయ్ నేను చెప్పింది అక్షరాలా జరిగినట్లుంది!" అంటూ వుత్తరం చించి, చదివి "మన మాట వేదవాక్కు నేను చెప్పలా! నీకు తప్పకుండా సెలక్షన్ వస్తుందని. ఇదిగో ఆర్డరు! చదువుకో!" అన్నాడు, హనుమంతరావు, ఆదుర్దాగా, వుత్తరం చదివి. "నిజమే! నువ్వు అన్నట్లే జరిగింది. ఇంటర్వ్యూకి వెళ్ళివచ్చిన దగ్గరనుంచి, నాకు సెలక్షన్ వస్తుందని అనుకుంటూనే వున్నాను... వెరీగుడ్" అన్నాడు అమితానందంతో.

కోర్టులో ఆ సమయంలో వున్న న్యాయవాదులందరికీ, హనుమంతరావు డిస్ట్రిక్టు మున్సిఫ్‌గా సెలక్టు అయినట్లు తెలిసింది. మున్సిఫ్‌గారికి కూడా ఈ సంగతి తెలిసి, బంట్రోతుతో 'హనుమంతరావుగారిని వొకసారి రమ్మని చెప్పు" అన్నాడు. అతను వెళ్ళి పిలుచుకు వచ్చాడు, 'కంగ్రాచ్యులేషన్స్! మిస్టర్ హనుమంతరావు. నేను మొదటి నుంచి అనుకుంటూనే వున్నాను. మీకు సెలక్షన్ వస్తుందని" అన్నాడు. ఇంతలో చిదంబరం అక్కడకు వచ్చి "ఇంత సంతోష సమయంలో మాకు టీ పార్టీ యివ్వకుండా తప్పించుకుందా మనుకుంటున్నావా! అదేమీ కుదరదు, మాకు ఈవేళ పార్టీ యివ్వాలి. తప్పదు" అన్నాడు.

"అలాగే! నీ మాట కాదంటానా!" అన్నాడు హనుమంతరావు

అరగంటలో టీ పార్టీకి అన్ని యేర్పాట్లు జరిగాయి. కోర్టు హాలులోవున్న కుర్చీలను సర్ది, బల్ల మీద పొడుగుగా వొక గుడ్డ పరిచి, వొక పూల కుండీ పెట్టారు మధ్యలో. హనుమంతరావు బిడియ పడుతూ వద్దన్నా, వినకుండా చిదంబరం వొక పూలదండ తెప్పించాడు.

సభ ప్రారంభం అయింది. చిదంబరం పూలదండ హనుమంతరావు మెడలో వేశాడు. కరతాళ ధ్వనులు మారుమ్రోగాయి హాలులో. తర్వాత చిదంబరం 'స్నేహితులారా! ఈ రోజు మనకు సుదినం. మన మిత్రుడు హనుమంతరావు డిస్ట్రిక్టు మున్సిఫ్‌గా సెలక్టు కావడం మన అందరికీ గర్వకారణం. యువకుడు, వుత్సాహవంతుడు, న్యాయశాస్త్రంలో ప్రవీణుడు అయిన అతను సెలక్టు కావడంలో మనం ఆశ్చర్యపడవలసినదేమీ లేదు అతను తప్పకుండా న్యాయమూర్తి అవుతాడని నేను వూహిస్తూనే వున్నాను. అతను ఈ పదవిని అలంకరిస్తున్నందుకు అతనిని అభినందిస్తూ, ఆయురారోగ్యములతో కలకాలం వర్ధిల్లాలని ఆశిస్తూ యింతటితో ముగిస్తున్నాను' అన్నాడు.

తర్వాత ఆ సభకు అధ్యక్షత వహించిన మున్సిఫ్‌గారు హనుమంతరావును అభినందిస్తూ 'మన వూరి అడ్వొకేట్ వొకరు మున్సిఫ్ అయినందుకు మనమంతా గర్వపడాలి" అంటూ హనుమంతరావును ప్రశంసిస్తూ కొద్దిగా మాట్లాడారు. తర్వాత అల్పాహార విందు జరిగింది.

అందరూ, టీపార్టీ కాగానే, యిళ్ళకు వెళ్ళిపోతున్నారు. హనుమంతరావు, యెప్పుడు ఇంటికి వెళ్ళి భార్యకు ఈ 'శుభవార్త' చెపుదామా అని తొందరపడుతున్నాడు. చిదంబరం అతని సంతోషం, ఆదుర్దా గమనించాడు.

చిదంబరం, హనుమంతరావు దగ్గరకువెళ్ళి నెమ్మదిగా "ఎప్పుడు వెళ్దామనుకుంటున్నావు అక్కడికి" అన్నాడు.

"మంచిరోజుచూసి వెళ్ళి ఛార్జి తీసుకుంటాను."

'కొంపతీసి. అంతపని చేసేవు ఇవేళ తారీకు ఎంత!" అన్నాడు చిదంబరం నవ్వుతూ.

"ఏప్రిల్ ఒకటి!... ఏమిటి! అయితే నన్ను ఫూల్ చేయడానికి ఈ నాటకం ఆడావా! ఆ ఆర్డరు నిజంకాదా "

'కాదు నీ ఉత్సాహం రోజూ గమనిస్తుంటే నిన్ను తమాషా చేద్దామనిపించింది. నిన్న ఒక టైపు ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్ళి ఒక ఆర్డరు టైపు చేయించి పోస్టులో వేశాను. ఇవేళ నీకు అందింది' నువ్వు అనుమానంతో డిటెక్ట్ చేస్తావేమోనని భయంతో వుత్తరం రాగానే, నీ దగ్గరనుంచి లాక్కొని, చింపి, చదివి, నీ చేతికి యిచ్చాను. నీవు హుషారులో యిది నిజమైన ఆర్డరు అవునో, కాదో నువ్వు వూహించలేక పోయావు. నన్ను క్షమించు! బాధ పడబోకు! నీకు అదృష్టంవుంటే ఈ నెలలో ఆర్డరు వస్తుందేమో!" అన్నాడు చిదంబరం. ఆర్డరు గురించిన చిదంబర రహస్యం బయట పెడుతూ.

'భలేవాడివే! న్యాయమూర్తి అని పొగుడుతూ చాలా అన్యాయం చేశావు. నేనింకా వెళ్ళి ఛార్జి పుచ్చుకుందా మనుకుంటే. డిశ్చార్జి అయిన బాటరీ లాగా అయింది నా పరిస్థితి."

★

# పాతకథే! వన్స్‌మోర్

అది మహారణ్యం. దానిరాజు సింహంగారు. మంత్రి, సామంతులతో ఒక సినిమా చూడటానికి కూర్చున్నారు.

స్వంతు సినిమాలు తీసితీసి డబ్బులు రావటం మానేసి,జంతువుల పిక్చర్లు తయారు చేస్తున్న ఒక ప్రొడ్యూసరు మొదటిసారి సింహంగారి దర్బారులో ఆ సినిమా చూపిస్తున్నారు.

ఒకచోట పెదజంతువును, చిన్నజంతువు ఆటపట్టించే సీనువచ్చింది. కుందేలు 'కసుక్కు'న నవ్వింది.

పక్కనేవున్న నక్క కుందేలును లటుక్కున గిచ్చి, "హుశ్! సింహంగారు నవ్వటంలేదు. కనిపించటంలా?" అన్నది. కుందేలు నోరుమూసుకుంది.

మరోసారి జింకనవ్వింది. అప్పుడూ నక్క అలాగే గిల్లి "సింహంగారు నవ్వటంలేదు. వినపడలా?" అన్నది. జింక ఏడుస్తూ వూరుకున్నది.

ఇంతలో సింహం గుహలోనుంచి లేచి గర్జించటం జంతువులన్నీ ప్రాణాలు గుప్పిళ్ళలో పెట్టుకుని, చెల్లాచెదురుగా పరుగులు తియ్యటం సీను వచ్చింది.

సింహం నవ్వటం మొదలుపెట్టింది.

నక్క దర్బారంతా ఎగిరిపోయేట్టు విరగబడి నవ్వుతూ గంతులు పెట్టటం మొదలు పెట్టింది.

సింహం....నక్క రసికత్వానికి మెచ్చుకున్నది.

నీతి: నవ్వినా ఏడ్చినా, పెద్దవాళ్ళ అడుగు జాడల్లోనే జరగాలి.

